క్లుప్తంగా

లివర్ బాధితురాలికి రూ.10 లక్షలు మంజూరు



బాధితురాలి భర్తకు ఎల్‌ఓసీ అందజేస్తున్న మంత్రి సురేష్

యర్రగొండపాలెం: లివర్ సమస్యతో బాధపడుతున్న ఓ మహిళలకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ చొరవతో సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.10 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు మంత్రి శుక్రవారం విజయవాడలోని తన క్యాంప్ కార్యాలయంలో బాధితురాలి భర్తకు ఎల్‌వోసీ కాపీని అందజేశారు. మండలంలోని ఎస్.కొత్తపల్లి గ్రామానికి చెందిన అంబటి మల్లేశ్వరి గత కొంతకాలంగా లివర్ సమస్యతో బాధపడుతోంది. చికిత్సకు రూ.20 లక్షలు అవసరమవుతాయని వైద్యులు తెలిపారు. ఈ విషయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి మంత్రి తీసుకెళ్లడంతో రూ.10 లక్షలను లెటర్ ఆఫ్ క్రెడిట్ ద్వారా మంజూరు చేశారు. సీఎం, మంత్రికి బాధిత మహిళ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

అధ్యాపకునికి డాక్టరేట్



శివనాగరాజును అభినందిస్తున్న శ్రీధర్

ఒంగోలు: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో మెకానికల్ విభాగానికి చెందిన అధ్యాపకుడు జువ్వి శివనాగరాజు డాక్టరేట్ అందుకున్నారు. చెన్నైకి చెందిన సవిత యూనివర్సిటీ నుంచి ఈ డాక్టరేట్‌ను ఆయన అందుకున్నారు. కాంప్రహెన్సివ్ స్టడీస్ ఆన్‌ది మెకానికల్ ప్రాపర్టీస్ ఆఫ్ సింఫరేమో ఇన్‌వాల్యు క్రాటమ్ ఫైబర్ రీయిన్‌ఫోర్స్ పాలిస్టర్ కాంపోజిట్స్ అనే అంశంపై చేసిన పరిశోధనకు ఆయనకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా ఆయనను పేస్ కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి శుక్రవారం కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో అభినందించారు.

బీజేపీతోనే అభివృద్ధి



మీడియాతో మాట్లాడుతున్న సూర్యనారాయణ

ఒంగోలు: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని, త్వరలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ పార్టీ మద్దతుతో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో నిలుస్తున్న చెన్నారెడ్డి దయాకర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేటుకూరి సూర్యనారాయణ కోరారు. స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టాలని కోరారు. విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి, జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

త్రిపురాంతకం ఆలయాలకు వెండి సామగ్రి బహూకరణ

త్రిపురాంతకం: త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయంలో పూజలకు వినియోగించేందుకు ఒంగోలుకు చెందిన ఏరువాక అగ్రో ప్రొడక్ట్ కంపెనీకి చెందిన జక్కిరెడ్డి బ్రహ్మారెడ్డి దంపతులు సుమారు రూ.80 వేల విలువైన 1.61 కేజీల వెండి సామగ్రి అందజేశారు. సంప్రోక్షణ అనంతరం వీటిని వినియోగించనున్నట్లు అర్చకుడు విశ్వనారాయణశాస్త్రి తెలిపారు.

ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

- ఆర్డీవో విశ్వేశ్వరరావు

చీమకుర్తి: లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా గృహాలను ఉగాది నాటికి పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో విశ్వేశ్వరరావు అధికారులకు సూచించారు. శుక్రవారం సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సచివాలయాల సిబ్బంది, హౌసింగ్, ఇతర డిపార్టుమెంట్ల అధికారులతో పక్కా గృహాలపై సమీక్షించారు. ఇప్పటి వరకు పూర్తయిన ఇళ్లు, లెంటిల్స్ వరకు వచ్చిన ఇళ్లు, ఇంకా బేస్‌మెంట్ లెవల్‌లోనే ఉన్న ఇళ్ల వివరాలడిగి తెలుసుకున్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడి త్వరగా నిర్మాణాలు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమీక్షలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో రాఘవేంద్ర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిపాడులో స్పెషల్ ఆఫీసర్ సమీక్ష..

మద్దిపాడు: ఉగాదిలోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్ ఝాన్సీరాణి మండల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మండలంలోని ఇనమనమెళ్లూరు గ్రామంలో జగనన్న ఇళ్ల లబ్ధిదారులతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఉగాది నాటికి 240 ఇళ్లు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, అందువలన ప్రతి లే అవుట్ ఆఫీసర్ తన పరిధిలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసే విధంగా లబ్ధిదారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ క్రమంలో నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని ఆమె కోరారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ త్వరగా ఇళ్లని నిర్మాణాలు పూర్తి చేసుకుని ఉగాది నాటికి ఇళ్లలో చేరడానికి సిద్ధంగా ఉండాలని కోరారు. అనంతరం నిర్మాణాలు పూర్తయిన ఇళ్లను ఆమె పరిశీలించారు. అనంతరం క్లాప్ మిత్రలతో కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, గ్రామ కార్యదర్శి విజయలక్ష్మి, ఇన్‌చార్జి వీఆర్వో సుశీల్, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు పున్నారావు, సంజయ్, పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.



సంతనూతలపాడులో సమీక్షిస్తున్న ఆర్డీవో విశ్వేశ్వరరావు



గృహాల లబ్ధిదారులతో మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ ఝాన్సీరాణి, ఎంపీడీవో, తహసీల్దార్



కొత్తపట్నంలో జగనన్న కాలనీలను పరిశీలిస్తున్న అధికారులు

గుండాయపాలెం, కరవది గ్రామాల్లో ప్రత్యేక అధికారి పర్యటన...

ఒంగోలు: గృహ నిర్మాణాలపై ఒంగోలు మండలంలోని గుండాయపాలెం, కరవది గ్రామాల్లో గల జగనన్న కాలనీల్లో మండల ప్రత్యేక అధికారి, ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు శుక్రవారం పర్యటించారు. గృహ నిర్మాణ దినోత్సవంలో భాగంగా పర్యటించి నిర్మాణ పనులను పర్యవేక్షించి అధికారులకు తగు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం జగనన్న కాలనీల లబ్ధిదారులతో మాట్లాడారు. నిర్మాణాలు పూర్తయిన చోట వెంటనే పైపులైను నిర్మాణ పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులు ఎవరైనా స్వయం సహాయక సంఘాల ద్వారా ఇంటి నిర్మాణానికి రుణం తీసుకుని పనులు మొదలుపెట్టకుంటే వారి జాబితాను తనకు అందజేయాలని ఆదేశించారు. ఇంకా నిర్మాణాలు మొదలుపెట్టకపోవడానికి గల కారణాలడిగి తెలుసుకున్నారు. కమిషనర్ వెంట హౌసింగ్ డీఈ, ఏఈ, ఇతర గృహ నిర్మాణ సిబ్బంది, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కొత్తపట్నంలో జగనన్న కాలనీ పరిశీలన...

కొత్తపట్నం: ఉగాది నాటికి మూడొంతుల గృహాలు పూర్తి చేసి గృహ ప్రవేశాలు నిర్వహించాలని తహసీల్దార్ బీవీ రమణారావు లబ్ధిదారులకు సూచించారు. శుక్రవారం కొత్తపట్నంలోని జగనన్న కాలనీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ బేస్‌మట్టం లెవల్‌లో ఉన్న ఇళ్లను రూఫ్‌లెవల్‌కు, రూఫ్‌లెవల్‌లో ఉన్న ఇళ్లను స్లాబ్ లెవల్‌కు తీసుకురావాలని వివరించారు. సచివాలయాల వారీగా టార్గెట్ ఫిక్స్ చేసుకుని దాని ప్రకారం ఉగాది నాటికి 310 గృహాలు పూర్తి చేసే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి వారికి వైఎస్సార్ కిట్లు అందుతున్నాయా, మెనూ సక్రమంగా అమలు చేస్తున్నారా అనే వివరాలడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల స్పెషల్ అధికారి అర్చన, ఎంపీడీవో పి.సుజాత, హౌసింగ్ ఏఈ నాంచార్లరెడ్డి, సచివాలయ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

శివరాత్రికి ఆలయాలు ముస్తాబు



విద్యుద్దీపాలతో ముస్తాబైన పొదిలి శివాలయం



ధ్వజారోహణ

పొదిలి రూరల్: మండలంలోని అన్ని గ్రామాల శివాలయాలు శివరాత్రికి ముస్తాబయ్యాయి. ముఖ్యంగా పట్టణంలోని శివాలయంలో ఉన్న ప్రసిద్ధ పుణ్య క్షేత్రం నిర్మమహేశ్వరస్వామి దేవాలయం, ఈగలపాడు సంగమేశ్వర దేవాలయం, ఏలూరు, ఆముదాలపల్లి, ఉప్పలపాడు, మాదాలవారిపాలెం, అన్నవరం దేవాలయాల్లో శివరాత్రికి నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయా దేవాలయాలకు రంగులు వేసి విద్యుద్దీపాలతో అలంకరించారు. శివరాత్రికి భక్తులు ఎక్కువగా వచ్చే అవకావం ఉండటంతో ఎక్కడా ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందు జాగ్రత్తలతో ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశారు. ఎండ ఎక్కువ ఉండటంతో ఆలయ ఆవరణలో టెంట్‌లు వేశారు. సౌకర్యవంతమైన దర్శనం, తాగేందుకు నీరు, అన్న ప్రసాదాల ఏర్పాటు, వైద్యసేవలు, పారిశుధ్యం వసతులు ఏర్పాటు చేశారు. శుక్రవారం నిర్మమహేశ్వర స్వామి వారు పార్వతీ పరమేశ్వర అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

బేస్తవారిపేట: మండలంలోని శైవక్షేత్రాలు శివరాత్రి సందర్భంగా ముస్తాబు చేశారు. శివరాత్రిని పురస్కరించుకుని ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించి ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలోని సోమవారిపేట, మోక్షగుండం, పిటికాయగుళ్ల, ఒందుంట్ల, కోనపల్లె గ్రామాల్లో శివాలయాలను ప్రత్యేకంగా అలంకరించి శివరాత్రి పర్వదినానికి సిద్ధం చేశారు.

మార్కాపురం: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని శివాలయంలో శుక్రవారం ధ్వజారోహణ కార్యక్రమంతో శివరాత్రి ఉత్సవాలను ఆలయ చైర్మన్ వి.కేశవరావు, అర్చకులు ప్రారంభించారు. ఇందులో భాగంగా శనివారం రాత్రి 8 గంటలకు పార్వతీపరమేశ్వరుల ఏదురుకోలా, గ్రామోత్సవం అనంతరం కల్యాణంను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లింగోద్భవ కాలంలో స్వామివారికి మహాన్యాణ పూర్వ రుద్రాభిషేకం 108 బిందెల జలంతో భక్తులచే అభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చైర్మన్ బాలమురళీకృష్ణ పాల్గొన్నారు.

దర్శి టౌన్: శివరాత్రి పర్వదినం నేపథ్యంలో శైవక్షేత్రాలన్నీ ముస్తాబయ్యాయి. నియోజకవర్గంలోని పలు ప్రసిద్ధ దేవాలయాలు ఇప్పటికే సిద్ధమయ్యాయి. స్వామి వారిని దర్శించుకుని వరాలు పొందేందుకు అధిక సంఖ్యలో భక్తులు ఆలయాలకు వెళ్లనున్నారు. దర్శి మండలంలో గంగా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర ఆలయం, కొర్లమడుగు పార్వతి సమేత సోమేశ్వరాలయం, పోతవరం శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేయనున్నారు. తాళ్లూరు మండలంలో అగస్త్యేశ్వర ఆలయం, గంగా పర్వత వర్థిని సమేత సోమేశ్వర ఆలయం, గుంటి గంగా భవాని వద్ద ఆలయం, తాళ్లూరు, మాధవరం, లక్కవరం శివాలయాలు, క్రిష్ణ స్వామి ఆశ్రమం వద్ద ప్రత్యేక పూజలు చేయనున్నారు.

కొనకనమిట్ల: భక్తుల మొక్కులు తీర్చే భోళాశంకరునిగా పేరొందిన శివాలయాలు మహాశివరాత్రికి ముస్తాబయ్యాయి. శనివారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని ఎదురాళ్లపాడు సంగమేశ్వరాలయం, నలనూతల కొండల్లో వెలసిన అన్నపూర్ణ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, అంబాపురంలో అంబబాల త్రిపుర సుందరి ఆలయం, బ్రాహ్మణపల్లి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, కొనకనమిట్లలో ఉమాపార్వతి రామలింగేశ్వర ఆలయం, చినారికట్ల గంగా పార్వతీ సమేత చెన్నమల్లేశ్వరస్వామి, పెదారికట్ల, రేగడపల్లి, బచ్చలకూరపాడు, మునగపాడు గ్రామాల్లోని శివాలయాల్లో అభిషేకాలు, అర్చనలు, శాంతి కల్యాణాలు నిర్వహించనున్నారు. బ్రాహ్మణపల్లిలో అన్నదానం చేయనున్నారు. అంబాపురంలో శివరాత్రి ఉత్సవాలు మూడు రోజుల పాటు నిర్వహిస్తారు.

పెద్దదోర్నాల: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలం వేళ్లే యాత్రికులు, శివభక్తులకు శుక్రవారం పలు ధార్మిక సంస్థలు అన్నదానంతో పాటు మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. మండల రెడ్ల సంఘం నాయకులు గంటా రమణారెడ్డి, బట్టు సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో, ఇస్కాన్ ప్రతినిధి అమల నియమదాస్ నేతృత్వంలో, శ్రీకృష్ణదేవరాయల కాపు, బలిజ, ఒంటరి, తెలగ సేవా సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.



ముక్తీశ్వరక్షేత్రం..



ఇస్కాన్ ఆధ్వర్యంలో అన్నదానం

మహాశివరాత్రికి భారీ బందోబస్తు

మార్కాపురం: మహాశివరాత్రి పండగను పురస్కరించుకుని ఘాట్ రోడ్డులో భారీ బందోస్తు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ డాక్టర్ ఎం.కిశోర్ కుమార్ తెలిపారు. తనతో పాటు నలుగురు సీఐలు, 12 మంది ఎస్‌ఐలు, 120 మంది పోలీసులతో పాటు స్పెషల్ పార్టీ పోలీసులు కూడా విధి నిర్వాహణలో ఉంటారన్నారు. దోర్నాల నుంచి శ్రీశైలం, దోర్నాల నుంచి ఆత్మకూరు మధ్య ఘాట్ రోడ్డులో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రయాణికుల రాకపోకల్లో అంతరాయం లేకుండా ఉండేందుకు పెద్దారవీడు మండలం కుంట వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను డైవర్షన్ చేస్తున్నట్లు తెలిపారు. వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి శ్రీశైలానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉన్నందున దోర్నాల మీదుగా ఆత్మకూరు, నంద్యాలకు వెళ్లాల్సిన భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు కుంట జంక్షన్ నుంచి మార్కాపురం మీదుగా గిద్దలూరు నుంచి నంద్యాలకు వెళ్లాలని తెలిపారు. వాహనదారులు పోలీస్ సిబ్బందికి సహకరించాలన్నారు. దోర్నాల శ్రీశైలం మధ్య, దోర్నాల–ఆత్మకూరు మధ్య ఎక్కడైనా వాహనాలు మరమ్మతులతో ఆగిపోతే తొలగించేందుకు క్రేన్‌ను కూడా ఆయా ప్రాంతాల్లో ఉంచినట్లు డీఎస్పీ కిశోర్‌కుమార్ వివరించారు.

ఎస్‌డీపీఐ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

ఒంగోలు: సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రాష్ట్ర నాయకుల పిలుపు మేరకు కర్నూలు యునాని వైద్య కళాశాల, ఆస్పత్రి పరిరక్షణకు స్థానిక ఇస్లాంపేటలోని మక్కా మసీదు వద్ద శుక్రవారం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌డీపీఐ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ సత్తార్ మాట్లాడుతూ ముస్లింలకు ఒకే ఒక్క యునాని కాలేజీ ఉందని, దాని నిర్వహణ లోపం వలన పూర్వ వైభవం కోల్పోయిందని అన్నారు. ముస్లింలు గర్వంగా చెప్పుకోవడానికి ఉన్న ఒకే ఒక్క యునాని కాలేజీ అని, అందువలన తక్షణమే టీచింగ్, నాన్‌టీచింగ్ బృందాన్ని నియమించి అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సంతకాల సేకరణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు.



సంతకాలు సేకరిస్తున్న ఎస్‌డీపీఐ నాయకులు

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

గుండమాల (కొత్తపట్నం): గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలంటే ఎస్‌డబ్ల్యూపీసీలను ఉపయోగంలోకి తీసుకురావాలని ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత తెలిపారు. శుక్రవారం గుండమాల పంచాయతీలో ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీను ఆమె తనిఖీ చేశారు. ఎస్‌డబ్ల్యూపీసీ ఆవరణలో కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లాప్‌మిత్రలతో ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి ఇంటికి రెండు డస్ట్‌బిన్లు ఇవ్వడం జరిగిందని, వాటిలో తడి, పొడి చెత్తను వేరువేరుగా వేసి ఇవ్వాలని సూచించారు. క్లాప్ మిత్రలు తడి, పొడి చెత్తను విడివిడిగా కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. వాటితో వర్మీ కంపోస్టు తయారు చేసి రైతులకు విక్రయించాలని వివరించారు. జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా డ్రై డే కార్యక్రమం నిర్వహించి గృహిణులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ ఏ బాల చెన్నయ్య, సర్పంచ్ కారాని జయరావు, కార్యదర్శి కె.వెంకటేశ్వరరెడ్డి, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.



గుండమాలలో కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమం నిర్వహిస్తున్న ఎంపీడీవో సుజాత

నేడు బైక్ ర్యాలీ

గిద్దలూరు రూరల్: బీసీ నాయకుడు బోడె రామచంద్ర యాదవ్ గిద్దలూరు విచ్చేస్తున్న సందర్భంగా యాదవ యువకులు శనివారం బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు బీసీ నాయకుడు పెట్టిల నారాయణ యాదవ్ శుక్రవారం తెలిపారు.

ఇనమనమెళ్లూరులో పది మంది నిరుపేదలకు సాయం

మద్దిపాడు: సామాజిక మాధ్యమం ఇన్‌ఫ్లూయెన్సర్ శ్రీదేవి తన చారిటీ ద్వారా పేదలకు సహాయం చేస్తున్న సంగతి పాఠకులకు తెలిసిందే. గురువారం మండలంలోని గార్లపాడులో పేదలకు ఆర్థిక, నిత్యావసరాల సాయం చేసిన ఆమె.. శుక్రవారం ఇనమనమెళ్లూరులో కూడా పది మంది నిరుపేదలకు సహాయం అందించారు. ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, సర్పంచ్ ఏకుల ఏడుకొండలు చేతుల మీదుగా ఆర్థికసాయం అందించారు. పేదలకు సేవ చేయడం మరిచిపోలేని అనుభూతి అని శ్రీదేవి అన్నారు. తమ గ్రామంలో సేవ చేయడానికి వచ్చిన శ్రీదేవిని ఎంపీపీ, సర్పంచ్‌లు, పలువురు గ్రామస్తులు అభినందించారు.



పేదలకు ఆర్థికసాయం చేస్తున్న శ్రీదేవితో ఎంపీపీ వాకా అరుణ, సర్పంచ్ ఏడుకొండలు

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ

తాళ్లూరు: మండలంలోని బెల్లంకొండవారిపాలెంలో పంచాయతీ తీర్మానాలు లేకుండా నిధులు దుర్వినియోగం చేశారంటూ గ్రామానికి చెందిన జీవీ శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు డీఎల్‌పీఓ పద్మ శనివారం విచారణ చేపట్టారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు దారుడిని పిలిచి విచారణ చేపట్టారు. 2021–22 ఆర్థిక సంవత్సరానికి చెందిన సాధారణ నిధులు రూ.1.88 లక్షలు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.8.44 లక్షలు తీర్మానాలు లేకుండా డ్రా చేసారని శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. పంచాయతీ సమావేశాలు 90 రోజుల్లో నిర్వహించలేదని, మెజార్టీ వార్డు సభ్యులు తిరస్కరించిన తీర్మానాలు ఆమోదించినట్లు రికార్డుల్లో చూపించారని డీఎల్‌పీఓకి తెలిపారు. స్పందించిన సర్పంచి పోశం సుమలత మంచినీరు, విద్యుత్, పారిశుధ్యం అవసరాల కోసం నిధులు వాడామని చెప్పారు. అందుకు సంబంధించిన రికార్డులు, బిల్లులు కార్యదర్శి శ్రీవల్లి చూపించారు. గ్రామసభ నిర్వహించి ప్రజల ఆమోదంతో ప్రజల అవసరాలు తీర్చామని తాము పైసా కూడా వృథా చెయ్యలేదని వివరించారు. ఇక్కడి పరిస్థితులు ఉన్నతాధికారులకు వివరిస్తానని డీఎల్‌పీఓ తెలిపారు. విచారణలో ఈఓఆర్డీ ఎన్‌యూ ప్రసన్నకుమార్ ఉన్నారు.

మీడియా సంస్థలపై దాడులు సరికాదు

ఒంగోలు అర్బన్: మీడియా సంస్థలపై కేంద్ర ప్రభుత్వం ఐటీ దాడులు చేయడం సరికాదని ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు అన్నారు. బీబీసీ మీడియా సంస్థపై బీజేపీ ప్రభుత్వం చేసిన ఐటీ దాడులకు నిరసనగా ఒంగోలు కలెక్టరేట్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసేందుకు వెళ్తున్న మీడియా సంఘాల నాయకులను పోలీసులు అడ్డగించి గేట్లు మూసివేశారు. దీంతో ఆగ్రహించిన నాయకులు.. గేటు వద్ద బైటాయించారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి పోలీసుల ఓవారాక్షన్‌పై ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్.. ఇలాంటి ఘటన పునారావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పడంతో విషయం సద్దుమణిగింది. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు గొట్టిపాటి నాగేశ్వరరావు, ఎస్‌పీ బ్రహ్మం, భక్తవత్సలం, భాస్కర్‌రెడ్డి, రాజు, కిరణ్, పాత్రికేయులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో నాణ్యతా ప్రమాణాల పరిశీలన



పీహెచ్‌సీ డాక్టర్లతో మాట్లాడుతున్న ఎన్‌క్వాస్ సభ్యులు ప్రీతిమదన్, భరణీకుమార్

మద్దిపాడు: మద్దిపాడు పీహెచ్‌సీలో నేషనల్ క్వాలిటీ ఎష్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్వాస్)ను కేంద్ర బృంద సభ్యులు శుక్రవారం పరిశీలించారు. ఆస్పత్రిలోని నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. ఆస్పత్రి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉన్నాయా..లేదా..? ఆస్పత్రిలో అందిస్తున్న సేవలు, ఓపీ, వ్యాక్సిన్‌కు కోల్డ్ చైన్ నిర్వహణ, లేబర్‌రూమ్ నిర్వహణ, ల్యాబ్‌లలో నిర్వహిస్తున్న పరీక్షలు.. ఇలా పలువురు చేస్తున్న పనులు, వాటికి సంబంధించిన రికార్డులను పూర్తిగా పరిశీలించారు. శుక్ర, శనివారాల్లో పూర్తిగా రికార్డులు పరిశీలించి ఎన్‌క్వాస్ సర్టిఫికెట్‌కు సిఫార్సు చేయనున్నట్లు టీమ్ సభ్యులు డాక్టర్ ప్రీతి మదన్, డాక్టర్ భరణీకుమార్ తెలిపారు. వారి వెంట ఆస్పత్రి డాక్టర్లు మానస, ఆనంద మోహన్, జిల్లా టీమ్ సభ్యులు కృష్ణప్రసాద్, మురళి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.